**మనసొంపుగా**

"అయ్యయ్యో! బ్రహ్మయ్యా, అన్యాయం చేశావేమయ్యా! ఈ బుల్లోడే బుల్లెమ్మే బుల్లోడైతే ఎంత రంజుగా వుండేదయ్యా...య్యా...య్యా..." అంటూ పల్లవి నా రెండు చేతులూ పట్టుకొని గిర్రున తిప్పేసింది. ఆ స్పీడుకు తట్టుకోలేక కళ్ళు తిరిగి నేను కుర్చీలో కూలబడ్డాను.

"ఏంటే అలా పడిపోయావ్? కళ్ళు తిరుగుతున్నాయా?" పరామర్శించింది సుగుణ.

"ఔనే! అబ్బ! రాక్షసి ఎలా తిప్పేసిందో చూడు" అన్నాను కోపంగా పల్లవి వంక చూస్తూ.

# ప్రణయ మానసం

"అమ్మాయిగారు కోపంలో కూడా చాలా అందంగా వుంటారు. ఔనూ... ఏమిటీ అప్పుడే కళ్ళు తిరుగుతున్నాయా? అంటే... అంటే... అప్పుడే నెలతప్పేశావా? వారెవ్వ ఏమి ఫాస్ట్...!" అంటూ పల్లవి నా భుజాలపై రెండు చేతులేసి, "చూపులతోనే కడుపొచ్చేస్తే పుట్టేవాడికి నాన్నవు తానే... వాడమ్మకు మొగుడవుతావే" అంటూ మళ్ళీ పాట అందుకుంది.

"నువ్వసలు మొగాడివై పుట్టాల్సిందే. బ్రహ్మదేవుడు పొరపాటున పరధ్యానంలో వుండి నిన్ను ఆడపిల్లగా పుట్టించాడు. సరే... జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు నీ సెక్స్ మార్చలేం కదా! మరి దాన్తో రొమాన్స్ మానేసి ఏ మగాడికైనా లైన్ వేసుకోకూడదూ?" అంది సుగుణ.

"వావ్! ఎంతమాటన్నావ్? నువ్వేనా ఇలా మాట్లాడేది? ప్రేమ... రొమాన్స్... లవ్... మొహబ్బత్ అంటే ఏమాత్రం గిట్టనిదానివి నువ్వు నాకు ఆ... ఆ... అలాంటి సలహాలు ఇస్తున్నావా?" టీవీ సీరియల్స్‌లోలా యాక్షన్ చేస్తూ అడిగింది పల్లవి.

"ఏం చేయమంటావ్? నీ గోల భరించలేక పోతున్నాం... నీ హింసని భరించేబదులు అలాంటి సలహా ఇవ్వడం బెటరనిపిస్తోంది" అంది సుగుణ.

"థ్యాంక్యూ వెరీమచ్ మైడియర్ గుణ! ఆమాత్రం అవకాశం ఇచ్చావ్ చాలు. ఇక ఈ ఛాన్స్‌ని ఏమాత్రం మిస్ కానివ్వను. అర్జంట్‌గా ఎవరినైనా ప్రేమించేస్తా" అం[illegible] నేలమీద చతికిలపడుతూ పల్లవి.

"ప్రేమించేయ్. కానీ కేవలం మగాళ్ళనే సుమా" అని కిసుక్కున నవ్వాను.

"ఓ సోస్ ఆమాత్రం నాకు తెల్దేటి! మగాడికే లైనేసుకోమని లైసెన్స్ ఇచ్చినాది కాదేటి" అంది యాసగా చేతులు తిప్పుతూ పల్లవి.

"నీకు పిచ్చి బాగా ముదిరిపోయింది" అని సుగుణ నెత్తిమీద గట్టిగా మొట్టికాయ వేశాను. సుగుణ పట్టించుకోకుండా 'ఎవరిని ప్రేమించాలి' అని ఆలోచిస్తూ వుండిపోయింది.

ఇంతలో నేను

"అరే మానస ఏదే?" అంటూ లేచి ముందు వరండాలోకి వెళ్ళి చూశాను. మానస బుద్ధిగా చదువుకుంటోంది.

"ఏయ్ మొద్దూ ఆదివారంనాడు చదువేంటి? లేచి రా" అంటూ మానసను బలవంతంగా మా గదిలోకి లాక్కొచ్చాను.

"చదవకపోతే నిజంగానే మొద్దునైపోతా. నేనేమీ నీ అంత తెలివైనదాన్ని కాదు" అంది మానస నాతోపాటు మంచంపై కూర్చుంటూ.

"పల్లవికి ప్రేమ పిచ్చి, మానసకి పుస్తకాల పిచ్చి" అంది సుగుణ.

"అరే యార్! ప్రేమపిచ్చికాదు, అదొక తియ్యని అనుభూతి. ప్రేమించనివాడు దున్నపోతై పుట్టున్ అన్నాడో మహాకవి తెలుసా?" అంది పల్లవి.

"మన అమ్మానాన్నలు మనల్ని బుద్ధిగా చదువుకోమని ఇక్కడకు పంపారు. అంతేగాని లవ్‌లు, డ్యూయెట్‌లు అంటూ వెర్రివేషాలు వేయడానికి కాదు" అన్నాన్నేను.

"నీ మొహం మడిచినట్టాక కాసంత కళాపోసన వుండాలంది మా నాయనమ్మ. కావాలంటే ఓసారి నా కళ్ళతో ప్రేమప్రపంచాన్ని చూడు. మన క్లాసులోనే కొందరు హీరోలున్నారు. అమోష్, మూర్య, మాధవ్... ముగ్గురూ ముగ్గురే. ఆ ముగ్గురిలో ఎవరిని సెలెక్ట్ చేసుకోవాలో తేలిక ఇందాకటినుంచి తికమక పడిపోతున్నా" అంది పల్లవి.

'నీకు సరైన సలహా కావాలంటే మానసను అడుగు" అన్నాను నవ్వుతూ.

"అమ్మో ఇలాంటి విషయాల్లోకి నన్ను లాగొద్దు. నేనెప్పుడూ వాళ్ళ ముఖాలైనా సరిగా చూడలేదు. నాకీ ప్రేమలు, దోమలు పట్టవ్. నేను, నా చదువు అంతే" అంది కంగారుగా మానస.

"అంత కంగారెందుకే? ఏదో తమాషాకి అంది. అయినా అడక్క... అడక్క నీలాంటిదాన్నే అడగాలా!" అంది సుగుణ.

"ఎవరేసలహా ఇచ్చినా, ఇవ్వకపోయినా నేను మాత్రం సెలక్ట్ చేసేసుకున్నా" అంది పల్లవి.

"ఎవరినీ? పక్కింటి ముసలాయన్నా?" అన్నాను నవ్వుతూ. "కాదు... లేదు 'మూర్య'ని. ఏం రూపం! ఏ వర్చస్సు! ఏం తీవి! పురుష పుంగవుడంటే అతడే! నా జగదేకవీరుడతడే!" అంది పల్లవి.

"అలాగలాగే! ఇవాల్టికి అతనితో సరిపెట్టు. పదండి బయటకు పోదాం" అంది మానస.

"నేను నా మనోవల్లభుడి గురించి చెబుతుంటే నీకెందుకమ్మా అంత అసూయ" అంది నాటకీయ ఫక్కీలో పల్లవి.

"నాకెందుకు అసూయ? ఆ పేరే నేనెప్పుడూ వినలేదు. అయినా, నీలా ఎవరి వెంటా పడను" అంది మానస.

"నేను ఎవరి వెంటా పడడం లేదు. ఊరికే సరదాగా అన్నానంతే" ఉడుక్కుంటున్నట్టు అంది పల్లవి.

"సరే... సరే... గొడవ ఆపండి... బైటకు బయలుదేరండి" అన్నాను. అందరం ఆ ఆదివారం సాయంత్రం అలాఅలా తిరిగేసి వచ్చాం.

సోమవారం ఉదయం నలుగురం కలిసి ఫస్ట్ పీరియడ్ ఎగ్గొట్టేసి సెకండ్ పీరియడ్ టైంకు కాలేజీకి వెళ్ళాం.



కాలేజీ గేటు దగ్గర స్టూడెంట్స్ గుమికూడి వున్నారు. పల్లవి గబగబా నాలుగడుగులు ముందుకేసి "ఏం జరిగింది?" అని ఆదుర్దాగా అడిగింది.

"మౌర్యగారికి యాక్సిడెంట్ జరిగింది" అన్నారు.

నా గుండె గుభేల్మంది. నిన్ననే మేమంతా సరదాగా అతని గురించి కబుర్లు చెప్పుకున్నాం. ఇంతలో ఇలాంటి వార్త వినాల్సి రావడం చాలా బాధనిపించింది. నేను సుగుణ, మానస వంక చూశాను. ఇద్దరి పరిస్థితి కూడా అలాగే వుంది.

మా క్లాస్‌మేట్స్ ఎవరూ కనిపించలేదు. బహుశా అంతా హాస్పటల్‌కి వెళ్ళుంటారనుకున్నాను. ఇంతలో సుగుణ తనకు తెలిసిన కాలేజ్‌మేట్‌ని, "ఏ హాస్పటల్‌లో అడ్మిట్ చేశారు?" అని అడిగింది. "పక్కనే వున్న నర్సింగ్‌హోంలో" అని చెప్పిందామె.

నలుగురం కలిసి నర్సింగ్‌హోంకు వెళ్ళాం. అయితే అప్పటికే చాలామంది అక్కడ వుండడంతో ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచారట. ఇక కాలేజీ జరిగే అవకాశం ఏమాత్రం లేదు. చేసేదేమీలేక కాళ్ళీడ్చుకుంటూ మా రూమ్‌కి తిరిగి వచ్చేస్తున్నాం. కొంతదూరం వచ్చాక "రూమ్‌కి వెళ్ళి ఏం చేస్తాం ఏదైనా సినిమాకి వెళ్దామే" అంది పల్లవి.

"ఇప్పుడు సినిమా చూసే మూడ్ లేదే. రూమ్‌కే పోదాం" అన్నాన్నేను.

"మూడు మూడ్ బాగుండనప్పుడే సినిమాకెళ్ళాలి. మౌర్య గురించి ఆలోచిస్తున్నావా? నథింగ్ హాపెన్స్ హి విల్ బి ఆల్‌రైట్. కమాన్, ఏదైనా సినిమాకెళ్తే మనసు కుదుట పడుతుంది" అంది పల్లవి.

"సినిమాకే పోదామే, రూమ్‌కెళ్ళాలంటే బోర్‌గా వుంది" అని వంతపాడింది సుగుణ.

నేను మానస వంక చూశాను.

మానస అయోమయంగా, పిచ్చిదానిలా దిక్కులు చూస్తోంది.

"హలో మిస్ అయోమయం! ఈ లోకంలోకి రా" అంటూ మానస భుజాలు పట్టి ఊపింది సుగుణ.

వెంటనే మానస ఒక్కసారిగా విరుచుకుపడిపోయింది. అందరం కంగారుగా పడిపోయాం.

"ఏయ్ మానస! మానస! లే.. లే.. ఏమైంది?" అంటూ మానసను లేవదీయడానికి ప్రయత్నించాం. ఇంతలో నలుగురైదుగురు మా చుట్టూ మూగారు. 'పాపం స్పృహ కోల్పోయినట్టుంది. నీళ్ళు చల్లండి' అని ఒకరు, 'అదుగో! ఎదురుగానే నర్సింగ్‌హోం వుంది, లోపలకు తీసుకెళ్ళండి' అని మరొకరు సలహా ఇచ్చారు. వెంటనే ముగ్గురం కలిసి మానసను మెల్లగా లేపి తలను భుజంపై పెట్టుకొని నడుం చుట్టూ చేయివేసి నర్సింగ్‌హోం వరకు తీసుకెళ్ళాం.

పల్లవి గబగబా లోపలికి వెళ్ళి డాక్టర్‌ని పిలుచుకువచ్చింది. ఇంతలో నర్స్ వచ్చి మానస ముఖంపై నీళ్ళు జల్లింది. ఆ లేడీడాక్టర్ బహుశా గైనకాలజిస్ట్ అనుకుంటా. బోర్డు కూడా మేం సరిగా చూడలేదు. ఆమె మానసను లోపల బెడ్‌పై పడుకోబెట్టించింది.

"ఏమిటే ఇవాళ ఇలా మనం హాస్పటల్స్ చుట్టూ తిరగాల్సి వచ్చింది. లేచిన వేళావిశేషం" అంది పల్లవి. మానసకు ఏమైందో ఎవరికీ అర్థం కాలేదు. ముగ్గురం నీరసంగా వరండాలో వున్న బెంచీపై కూర్చున్నాం.

ఇంతలో ఊహించని విధంగా ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి అందరం ఆశ్చర్యపోయాం.

మౌర్య మోటర్‌బైక్‌ని స్టాండ్ వేసి లోపలకు వస్తూ కనిపించాడు.

అతనూ మమ్మల్ని చూసి ఆశ్చర్యపోతూ,

"ఏమిటి మీరంతా ఇక్కడ వున్నారు?" అని అడిగాడు. పల్లవి ముందుగా తేరుకుని "ముందు ఈ విషయం చెప్పండి. ప్రొద్దున మన కాలేజీ దగ్గర యాక్సిడెంట్ అయ్యిందెవరికి?" అనడిగింది.

"ఓ అదా! మీరూ బోల్తా పడ్డారన్నమాట. యాక్సిడెంటయింది నాక్కాదు. మన కాలేజీలో కొత్తగా చేరిన లెక్చరర్ మౌర్యచంద్రగారికి. ఆయన చేరి నాలుగురోజులే అయింది. అందుకే చాలామందికి ఆయన ఎవరో తెలియదు. నేనివాళ అసలు కాలేజీకే రాలేదు. యాక్సిడెంటని వినగానే మన వాళ్ళు మా ఇంటికి వచ్చేశారు కూడా... అదిసరే మీరెందుకు ఇక్కడ వున్నారు?" అని అడిగాడు మౌర్య.

"ఏం చెప్పమంటావ్! తిరిగొస్తుంటే మానస అకస్మాత్తుగా రోడ్డుమీద పడిపోయింది. ఈ నర్సింగ్‌హోంలోకి తీసుకొచ్చాం. లోపల డాక్టర్‌గారు పరీక్షిస్తున్నారు" అని చెప్పాం.

మౌర్య గబగబా లోపలకు వెళ్ళాడు. మేము కూడా అతనితోపాటు లోపలకు వెళ్ళాం.

లోపల బెడ్‌పై మానస పడుకొని వుంది. మౌర్య మెల్లగా మానస దగ్గరకు వెళ్ళి తట్టి "మానసా" అని పిలిచాడు.

మానస మెల్లగా కళ్ళు తెరచి చూసి

"మౌర్య!" అంటూ గట్టిగా అరచి అతన్ని అమాంతం కౌగిలించుకుంది. ఆ దృశ్యం చూసి మేమంతా అవాక్కయిపోయాం. మానసకేమైనా పిచ్చిపట్టిందా అనుకున్నాము మనసులో.

"కంట్రోల్ యువర్ సెల్ఫ్. నాకేం కాలేదు. రిలాక్స్... రిలాక్స్" అంటూ మౌర్య మానసను సముదాయించాడు. మేము ముగ్గురం ముఖాలు చూసుకున్నాం. మెల్లగా బయటకు వచ్చేశాం.

కొద్ది నిముషాల తర్వాత మౌర్య బయటకు వచ్చాడు. "మీకు అసలు విషయం అర్థమయ్యే వుంటుంది. నేనూ, మానస చాలాకాలంగా ప్రేమించుకుంటున్నాం. చదువు పూర్తయ్యాక పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. ఈ నర్సింగ్‌హోం డాక్టర్ మా అక్క ఫ్రెండ్. ఆమెకో కబురు చెప్పాలని వచ్చాను. ఇలా మీకు దొరికిపోయాను" అంటూ మౌర్య వెళ్ళిపోయాడు. మేం ఆశ్చర్యం నుంచి తేరుకునేలోపు మానస మెల్లగా బయటకు వచ్చింది. మానసతోపాటే డాక్టర్ కూడా వచ్చి, "అర్థమైంది కదూ. 'షాక్' తట్టుకోలేక అలా పడిపోయింది" అంది.

ఎంతో అమాయకంగా వుండే మానస ఇంతటి ప్రేమ వ్యవహారం గుట్టుగా సాగిస్తోందని తెలిసి, ఆశ్చర్యం నుంచి తేరుకోవడానికి మాకు చాలా రోజులు పట్టింది.

—"మోతీలాస్య"